# పిచ్చిదాని గీత

## సి. శైలకుమార్

భోజనంచేసి చెయ్యికడుక్కుంటూ కిటికీగుండా చూశాను. వర్షం యింకా కురుస్తూనే వుంది. సాయంత్రం ఆరునుంచి తనకిక పనిలేనట్లుగా పడుతూ అంతకంతకూ పెరిగిపోతోంది.

సిగరెట్ వెలిగించి గదంతా పరిశీలించాను. వస్తువులు చిందరవందరగా పడి బ్రహ్మచారి గదికి సాక్ష్యంలావుంది.

చినుకుల శబ్దంతప్ప మరింకేం వినిపించడం లేదు. భయంకరమైన మౌనం మస్తిష్కాన్ని పట్టి పీడిస్తోంది. ఏకాంతిక మౌనం ప్రేమికుడికి కలల కౌగిలి ప్రసాదిస్తుందేమోగాని, నాకు మాత్రం నరకంలావుంది. ఏం రాద్దామన్నా ఐడియా రావడంలేదు. ఏం చెయ్యడానికీ తోచడంలేదు.

"వర్షంలో తడుస్తూ తిరిగితే " హఠాత్తుగా అనిపించింది. ఇళ్ళల్లో వెచ్చగాదుప్పట్లు కప్పుకొని పడుకున్నవాళ్ళు కిటికీలగుండాచూసి పిచ్చివాడనుకుంటారేమో? అనుకోనీ నాకేం? జ్వరం మొస్తే? రానీ ఆ అనుభవమూ చూద్దాం.

వెళ్ళాలనే నిశ్చయంతో తలుపులు తెరిచి అటూయిటూ చూశాను. అంతా అంధకారం. అరుగుపయిన ఏదో ఆకారం కూర్చున్నట్లు అనిపించి "ఎవరది" అంటూ ప్రశ్నించాను. జవాబులేదు. దగ్గరగా వెళ్ళిచూశాను. పిచ్చిది. సగం తడిసి ముడుచుకుని కూర్చునివుంది.

ఈ పిచ్చిది ఈవూరువచ్చి దాదాపు నాలుగు నెలలవుతుంది. మాసి చినిగిపోయిన బట్టలూ, తైలసంస్కారం లేక పేలు నిండినతల, ఎముకలగూడు శరీరం.

అందర్నీ ప్రేమగా చూస్తుంది. ఎవర్నీఏమీ అనదు. ఏమీ అడగదు. ఎవరయినా దయతలచి అన్నం పెడితే తింటుంది, రాత్రిపూట ఏదో ఒక అరుగుమీద నిర్భయంగా, స్వేచ్ఛగా పడుకుంటుంది.

నాకు ఎన్నాళ్ళనుంచో ఈమెపై కథరాయాలని కోరిక. జీవితంనుంచి ఏరుకున్న వాటిని తప్ప, చెత్తకథలు నేను రాయను. నిజానికి అసలు నేను రచయితనుకాను, కవినిమాత్రమే.

"లోపలకు రా" పిలిచాను. కళ్ళెత్తి నావేపుచూసి భయంలేకుండా గదిలోకి ప్రవేశించింది. తలుపులు దగ్గరగావేసి దీపకాంతిలో ఆ ముఖాన్నిచూశాను. శిథిలమైన సౌందర్యపు ఛాయలు, కొండంత గర్వాన్ని కోల్పోయినట్లు కనిపిస్తున్న కళ్ళు, రసహీనమైన చెరకుపిప్పిలాంటి పెదాలు. ఇంత దగ్గరగా యీమెను చూడటం యిదే మొదటిసారి.

"అన్నం తిన్నావా?"

లేదన్నట్లు తల ఆడించింది. నా కారియర్లో మిగిలిన అన్నాన్ని ఆమె ముందుంచి తినమన్నాను. మెల్లగా తినసాగింది.

ఈమె జీవితంగూర్చి ఈమెను ఎలాప్రశ్నించి తెలుసుకోవాలో ఆలోచించసాగేను.

నేను ఆమెవేపు చూసేసరికి ఆమె తన చిరిగిన చీర కొంగుతో పెదాలు తుడుచుకుంటూ లేచి నిలబడింది.

"పర్వాలేదు కూర్చో" అన్నాను. గోడ నానుకుని కూర్చుంది.

"నిన్నో విషయం అడగనా" సందేహంగా అడిగేను.

కళ్ళు పెద్దవిచేసి "అడిగేముందు, కలువల లోన విచ్చినకత్తుల రేకులు చూశావా? మంటల లోన మాడక నిలిచిన మల్లెలుచూశావా?" అంది.

ఏమనాలో అర్థంకాలేదు నాకు. అయినా అడిగేను. "నీ పేరేమిటి?"

"పేరెందుకు వూరెందుకు?

మనసు మమత తెలిపేందుకు" అందిమళ్ళీ.

ఏమిటీ మనిషి, ఏమిటీ సమాధానాలు, అంతా చిత్రంగావుంది. ఖచ్చితంగా ఈమెకథ రాయాల్సిందే. నాలో పట్టుదల పట్టుబట్టింది.

"ఇంతకూ ఎవరు నువ్వు?"

"నీకెందుకు?"

"నీపై ఓకథ రాద్దామని" కథంటే చెబుతుం దని నా భావన.

"కథరాస్తావా. రచయితవా?" అంది తల గీరుకుంటూ.

"ఔను"

"ఏంపనిచేస్తున్నావ్?" అంది వెక్కిరింపుగా.

"ఏ పనయితేనేం,నాకు ప్రాణం సాహిత్యం" అన్నాను.

"అః పప్పులో కాలేశావు. చూడు సాహిత్యము ప్రాణంకంటే యెక్కువే, ఎందుకంటే ప్రాణం పోయినా సాహిత్యం పోదుకాబట్టి తెలుసా" అంది.

నాకెంత ఆశ్చర్యంవేసిందో నాకే తెలియదు. ఒక పిచ్చిదానిలో యింత ఆలోచనా? యింత జ్ఞానమా? యీమె నిజంగా పిచ్చిదేనా? లేక నటిస్తోందా? సందేహాల సాలెగూట్లో చిక్కుకున్నట్లనిపించింది. మరో సిగరెట్ వెలిగించి.

"పిచ్చిదానిలా కనిపిస్తున్న ఓ అనామికా, నీ కథ తెలుపవా?" అన్నాను దీనంగా యిలాగైనా చెబుతుందేమోనని.

"కథ కథలోనూ ఏదో ఒక వ్యథ.

మది మదిలోనూ ఏదో ఒకరొద తెలుసా" అంది.

ఆమె మాటలాడుతున్న ప్రతిమాటపై ఒక కావ్యం రాయవచ్చు. గత జీవితంలో బాగా చదువు కొన్నదై వుండాలి. కానీ యిలా మారడానికి కారణం ఏమిటో? అడిగిన ప్రతి ప్రశ్నకు ఓ చిక్కు ముందుపెట్టి విప్పుకోమంటోంది ఎలా? ఆలోచనలో పడ్డాను.

నా మౌనం ఆమెకు బాధ కలిగించినట్లుంది. "మౌనం దాల్చావెందుకు కోపమా?" అంది.

లేదన్నాను తల ఊపుతూ.

"మరి" అంది.

"సాటి మానవుడుగా అడుగుతున్నాను. యింతకూ నువ్వెవరు? చెప్పు" అన్నాను దీనంగా మరెలా అడిగినా ఆమె చెప్పదేమోనని.

"నేనా నేను చలాన్ని, శ్రీశ్రీని, ఊర్వశిని, షెల్లీని."

నాకేమీ అర్థంకాక అలాగే చూస్తూవున్నాను. నవ్వుతూ "చెబుతా విను" అంది.

## 1

నేను ఓ సంపన్న కుటుంబంలో పుట్టిన సంపంగిని. నిత్య నూతనత్వాన్ని వలచే దాన్ని. బి.ఏ. లో చేరే సరికే నా మనస్సు ఈ సమాజపు ఆలోచనల స్థాయిని దాటిపోయింది.

నేనెంత అందగత్తె నంటే నా కాలికి ముల్లు గుచ్చుకుంటే కాలేజీ అంతా ఏడ్చేది. ఒక్కరోజు కాలేజీ మానేస్తే అప్పటి యువకవులంతా విరహ గీతాలు రాసుకొనేవారు.

నీలాగే నేనూ సాహిత్యం ప్రాణంగా, జీవితంగా ఎంచుకొన్నాను. ప్రేమించాను. సత్ సాహిత్యానికి కదలి కదలి, కన్నీరు చిలికించి, కడలిలా పొంగి, కలల్లో తేలి, ఊహాల వలల్లో చిక్కి, ఉర్విని దాటి ఊర్ధ్వలోకాలకెక్కడికో వెళ్ళిపోయేదాన్ని.

ఆ స్థితిలో నన్ను ప్రభావితంచేసి, అణువణువూ, ఆవహించినవాడు "గుడిపాటి వెంకట

చలం." ఆయన సాహిత్యం చదివి, స్త్రీలలైంగిక స్వేచ్ఛకై ఆయన పడుతున్న ఆరాటం గ్రహించి, పురుషుడి అహంకారాన్నీ, అహంభావాన్నీ వెక్కిరించాలనీ ఎదిరించాలనీ ఆయన చెప్పినట్లు జీవించడం ప్రారంభించాను.

ఫలితంగా నేను మెచ్చిన వాడితో, నాకు నచ్చిన విధంగా తిరిగేదాన్ని. కాలేజీ అంతా కాముకురాల్నని ముద్ర వేసింది.

ఒకరోజు నాకు నచ్చని లెక్చరర్ నన్ను కోరాడు. ససేమిరా వీలు కాదన్నాను నేను. ఆయన కోపంతో నిజాలకు కధలు జోడించి మా యింట్లో వాళ్ళ చెవికి తగిలించాడు.

అప్పటికే నా గురించి చూచాయగా తెలిసిన వాళ్ళు మరీ కోపంతో నన్ను బెదిరించారు. నేను ఎదిరించాను. కాలేజీ మానెయ్యమన్నారు. వీలు కాదన్నాను. నాన్న కొట్టాడు. నేను తిట్టాను.



నా తిరుగుళ్ళ ఫలితంగా నాకు గర్భం వచ్చింది. ఇంట్లోనూ, బయటా అందరూ అసహ్యించుకొంటూ అనాదరించారు. ఏమీ చేయలేని తండ్రి యిల్లు వదలి పొమ్మన్నాడు. నాకూ స్వేచ్ఛకావాలనిపించి, ఒకరాజు అర్ధరాత్రి యిల్లనే బంధిఖానా వదిలేశాను.

నాతో తిరిగిన అందరూ నన్ను దూరంగా చూస్తూవచ్చారు. దేవులపల్లి ఊర్వశిలా నన్నెవ్వరూ ఆరాధించలేదు. చలం శశిరేఖలా నన్నెవ్వరూ దగ్గరికి తీసుకోలేదు. "పిచ్చిముండ"నైన నన్ను ఏ "మీరా" కూడా లాలించలేదు.

అప్పుడే గ్రహించుకోగలిగాను అందరూ అందుబాటులోవున్న నా అందాన్ని మాత్రమే అందుకున్నారనీ, నా మనసు నాకే వదిలేశారనీ.

జీవితంలో ఆకలికి ఎంత ప్రభావం వుందో

యిల్లు వదిలేశాక కానీ నాకు అర్థం కాలేదు.

నేను చేరుకున్న పట్నంలోని పంపు నీళ్ళు నా ఆకలి తీర్చడంలేదు. అర్ధాంతరంగా ఆగిపోయిన చదువు ఏ ఉద్యోగాన్నీ ప్రసాదించలేదు. ఏ ఆలంబనా దొరకని అస్తవ్యస్త శారీరక, మానసిక స్థితి.

ఆలోచనల్లో తెలిసింది, అమ్ముకోడానికి అందంతప్ప మరేం మిగల్లేదని. దాంతో జీవితం మారింది. డబ్బిచ్చిన ప్రతివాడికీ అందాన్ని అందించాను. శారీరక యంత్రానికి కూడా అరుగుదల వుంటుందని అప్పుడేగ్రహించుకోగల్గాను. పుట్టినబిడ్డ చనిపోవడంతో పెద్ద బరువు తొలగినట్లు ఫీలయ్యాను.

అంత దీనస్థితిలోవున్నా సాహిత్యం చదవటం, కవిత్వం రాయటం మాత్రం మానలేదు. సోమర్ సెట్ మామ్, షెల్లీ, కీట్స్ కదిలిస్తూ వచ్చారు నన్ను. కలలు కనడము కన్నీళ్ళువదలడం మానలేకపోయాను.

## 2

ఆ వలయంలోంచి మరో చైతన్యనిలయంలోకి నన్ను లాగినవాడు క్రాంతి. క్రాంతిలో శ్రీశ్రీని చూశాను. కాదు శ్రీశ్రీని కాంతిలో చూశాను. ఆ కాంతిలో లోకాన్ని చూశాను. దృక్పథం మళ్ళీ మారింది.

నిజానికి క్రాంతి అందానికి నేనే అతన్ని నా యింటికి వచ్చేలా వలవేసి వలపించుకున్నాను. నా జీవితంవిని నిజంగా నన్ను ప్రేమించి నాకై విలపించిన వాడతడు.

"నీబాట యిదికాదు, నీచోటు యిదికాదు" అంటూ లోకంలో పెరుగుతున్న ఆకలినీ, తరుగుతున్న జీవనప్రమాణాల్నీ, అనాధల్నీ, అభాగ్యుల్నీ, దోపిడీనీ, దోపిడీచేస్తున్నవాళ్ళనీ చూపించాడు. శ్రీశ్రీ అన్నట్లు "పతితులార, భ్రష్టులార, బాధాసర్పదష్టులార, పనికిమాలి, బ్రతుకుకాలి, ఏడవకండేడవకండి వస్తున్నా, వస్తున్నా" అంటూ నన్నూ రమ్మన్నాడు. "ఎక్కడికన్నానుః" "సమస్యలులేని సమాజాన్ని నిర్మించుకోవడానికి" అన్నాడు.

జగాన వెలుగు పండించడంకన్నా గొప్పదేముంది అనుకొని క్రాంతితో కాంతిబాటలో అడవుల్లోకి నడిచాను.

పువ్వులు పట్టుకున్న చేతుల్లో తుపాకీ నిలిచింది. తుపాకీ తూటాల సువాసనే నాసికనాశ్రయించి మత్తుగొల్పింది.

అప్పుడు కామంతో ఎర్రబడ్డకళ్ళు. ఇప్పుడు కోపంతో యెర్రబడ్డకళ్ళు. అంతే తేడా.

ఉద్యమం ఉప్పెనలా సాగుతోంది. ఐదేళ్ళలోగానే దేశపు మౌలికస్వరూపాన్నే మార్చేస్తామనే శాస్త్రీయమైన కలలు మాలో. పోరాటపు పాటల్నిరాస్తూ అందర్నీ ఉత్తేజపరచి, ఉత్సాహమిచ్చేదాన్ని నేను.

తిరగబడుతున్న ప్రజల్నీ, కదులుతున్న పునాదుల్నిచూసి ప్రభుత్వం గంగవెర్రులెత్తింది. దాని ఫలితంగా మా ప్రాంతాలనిండా సైన్యం దిగింది.

జీతాలకోసం ప్రాణాలు కొదువబెట్టుకొన్న వాళ్ళకూ, జీవితాలకోసం ప్రాణాల్ని పణంగా ఒడ్డగల మాకూ రణం ప్రారంభమయింది.

కొండ బలానికి గుండెబలం ఓడిపోతుందని మేమనుకోలేదు. మాచుట్టూ, మా ఆశయాల చుట్టూ తుపాకుల సముద్రం, తూటాల అలలు.

వందల్లోవున్న మేము ఒక్కొక్కరే రాలిపోసాగేము.

## 3

ఒకరాత్రి భయంకరమైన చీకటి ఆవరించుకొన్న రాత్రి, ఓ పొదలో ఎదపై తుపాకుల్తో అప్రమత్తతతో కూర్చుని వున్నాం, నేనూ క్రాంతి, మరికొందరూ.

హఠాత్తుగా గుళ్ళవర్షం ప్రారంభమయింది. ఎదిరించే శక్తిలేని మేమందరం పారిపోను ప్రారంభించాం. కాని క్రాంతి వాలిపోయాడు. తుపాకుల శబ్దమూ ఆగిపోయింది. అసలేవేపు నుంచి తుపాకులు పేలాయో యెవరికీ అర్థం కాలేదు.

పరిగెత్తుకుంటూవెళ్ళి, క్రాంతిని నా ఒళ్ళోకి లాక్కున్నాను. ఎదపైనుంచి ఏకధారగా స్రవిస్తోన్న రక్తం. మృత్యువులేని, సమాజం సృష్టించాలని శ్రమించిన క్రాంతి మృత్యువుతో

ఆఖరిపోరాటం చేస్తూకూడా "వెళ్ళు. శత్రువులు చుట్టుముట్టుతున్నారు. ప్రమాదం దండెత్తుతోంది. నాకోసం దిగులుపడకు. నేను ఇంక యెంతో సేపు జీవించను" అంటూ నాకళ్ళలోకి సూటిగాచూస్తూ కళ్ళుదించేశాడు.

గాలి, నేల, చీకటి, పొదలూ అన్నీ ఏడ్చాయి. ఆఖరిసారిగా క్రాంతి పెదవుల్ని ముద్దుపెట్టుకొని, నిర్జీవశరీరాన్ని నిర్జీవ పరిసరాలకు వదలి చేసేదిలేక పారిపోయాను.

క్రాంతిపోయిన విషాదమేఘచ్ఛాయ నన్ను వీడి పోకముందే,ఒకరోజు ఒక వాగుచెంత నీళ్ళు తాగుతూ పోలీసులకు పట్టుబడ్డాను.

రహస్యాలేవీ చెప్పలేదనే కోపంతో "నరకం" ఎలా వుంటుందో చూపించారు నాకు. పన్నెండుమంది నాలోని రహస్యాలన్నీ గాలించి నాలోమిగిలివున్న సౌందర్యాన్నిచూసి ఆకలితో నాపైబడ్డారు. ప్రతిఘటించాను. కానీ ఫలితం శూన్యం.

ఏ కొద్దిగానో నాలో మిగిలివున్న సౌందర్యం దానితో పూర్తిగా శిథిలమైంది.

ఏవేవో అభియోగాలతో నాపై కేసులు బనాయించారు. నాలుగు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది న్యాయస్థానం.

జెయిల్లో, ఆ వాతావరణం, ఆ ఆహారం స్వేచ్ఛ లేకపోవడం, అక్కడ ఖైదీలపై సాగుతున్న దౌర్జన్యంచూసి, అనుభవించి ఆశయాలు బలపడ్డాయేగానీ, శారీరకారోగ్యం పూర్తిగా దెబ్బతింది.

జెయిలునుంచి విడుదలయ్యాక ఎక్కడికి వెళ్ళాలో, ఏం చెయ్యాలో యేమీ అర్థంకాలేదు. చేతిలో జీవమున్న కాగితాలేమీ లేవు.

మహోధృతంగా సాగిన మహోద్యమం, తెలియకచేసిన కొన్నితప్పులవల్ల, ఆవేశంవల్ల, నీరుగారి నిర్వీర్యమై పోయింది. ఎవరు ఎక్కడున్నారో ఎవరికీ తెలీదు.

ఆ స్థితిలో ఈ ఊరువచ్చాను. ఇక్కడ నా మిత్రుడు ఒకడు వుండాలి. కానీ అతనూ ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఊర్లో తిరుగుతున్న నన్నూ, నా ఆకారాన్నిచూసి అందరూ పిచ్చిదనుకొన్నారు. జాలి చూపించారు.

నాకూ కొంతకాలం యిలా గడపాలని అనిపించింది. ఇదీ నా సంక్షిప్త కథ.

* * *

"ఎందుకేడుస్తున్నావ్?" అంది నా దగ్గరగా వచ్చి కళ్ళనీళ్ళు తుడుస్తూ.

"నీ జీవితం పాడవడానికి కారణం సాహిత్యమా" ప్రశ్నించాను.

"కాదు, ఎన్నటికీ కాదు. సాహిత్యాన్ని అన్వయించుకోవడంలో నేను పొరబడ్డాను. తప్పటడుగు వేశాను. కానీ నా జీవితం ఏమీ పాడుకాలేదు. ప్రజలకై మరణించడం హిమాలయంకన్నా గొప్పదన్నాడో మహానాయకుడు. నేను ఆ దారిలో వెళ్ళాను. నేను కాకున్నా, నేడు కాకున్నా రేపు మరెవరో ఈ విశ్వాన్ని తప్పక ఆ గమ్యం చేరుస్తారు" అంది.

ఆమె ముఖంలోకి చూశాను. లాలనగా నన్ను చూస్తూ నవ్వుతూ నా కన్నీళ్ళు తుడిచి "నీవు చేయవలసింది. సానుభూతి చూపడం. కన్నీళ్ళు కార్చడం కాదు. ఒక్కో అశ్రుకణాన్ని ఒక్కో అగ్నిబాణంచేసి చీకటిపై యుద్ధం ప్రకటించు. చలించే గుండె కరగని ఆయుధాలగని. అదిగో సమర రంగంలో విజయ సవనానికి ఆయత్తపడాలని ఎదురుచూస్తున్నా రందరూ. కవితా గాండీవంతో చైతన్య బాణవర్షాన్ని, ఈ సమాజపు కళ్ళపై ప్రయోగించు. చావు బతుకుల్లోవున్న సింహాన్ని కాపాడుకోవలసిన బాధ్యతమీదే" అందామె ఆవేశంతో ఊగిపోతూ గీత బోధిస్తున్నదానిలా.

ఆ క్షణంలో ఆమె నాకు తల్లిగా, చెల్లిగా, ప్రేయసిగా, దేవతగా అనిపించి కౌగిలించుకొన్నాను.

బిడ్డను లాలించే తల్లిలా ఆమె నా వీపు నిమురుతూ "మానవతా విలువల్లేని ఈ డబ్బు వ్యవస్థలో నిజాలు గుర్తించు. మరో ప్రపంచపు మహాప్రస్థానానికి సిద్ధంకా" అంటూ నన్ను వదలి సుడిగాలిలా వీధిలోకి వెళ్ళి చీకట్లో మాయమైంది.

ఆ అనుభూతినుంచి, ఆ అనుభవంనుంచి తేరుకున్నాక కానీ నాకు అర్థంకాలేదు

"మంటల్లో మాడక నిలిచిన మల్లెలు ఆశయాలనీ. కలువలలోన విచ్చిన కత్తుల రేకులు అడ్డంకులనీ." □